ఆనందానికి గడప అడ్డు తగిలి గోపిని బోల్తా కొట్టించబోయింది. తమాయించుకుని ముందుకు తూలి, రెండు పెద్దడుగులు వేసి ఆగాడు. ఒళ్లెరుగని సంతోషం వస్తే కళ్లముందు ఏమున్నది కనపడదు. జ్ఞానేంద్రియాలన్నీ దానితో ఒకటై తమ తమ కర్తవ్యాలకు కాటుక పెడతాయి గామోలు! గోపి కంటినిండా చిత్రమైన వెలుగు. అతనికి ఎవరితో ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు.

'అమ్మా! .... అమ్మోయ్!' అనరిచాడు.

గది గోడలు కూడా ఉలిక్కిపడి దగ్గరగా వచ్చి సంగతు లేమిటన్నాయ్.

వంటింట్లోంచి పార్వతివచ్చింది. ముఖంలో అక్కడక్కడ అప్పు ఇచ్చిన వాడిలా కదలకుండా కూర్చున్న నీటిబొట్లు. జుత్తు గాలితో ఆడుకోటానికి వస్తానంటుంటే, జడపిన్నులు నోరు నొక్కికూర్చోమంటున్నాయ్. చేతిలో అట్లకాడ, ముంజేతిమీద మసిబొట్టు—గోపి అమ్మను చూసి తెల్లబోయాడు. ఈపాటికి అమ్మ దువ్వి జడేసుకుని చక్కగా తయారై 'నాన్నొస్తారు. నాన్నొస్తారు' అంటూ నిలబడాల్సింది. ఏమిటీ మార్పు?

'అమ్మా! అలా ఉన్నావేం?' అనడిగాడు.

పార్వతి కంగారుపడింది. ఎలా ఉంది తను? కుడివైపుకు కొద్దిగా కదిలేసరికి ఎదురుగా ఉన్న అద్దంలో ప్రతిబింబం పూర్తిగా కనపడింది. మరుక్షణం ఆమె ఫక్కుమంది.

'అదా? .... వంటమనిషి నిలిచిపోయిందిగా మరి!—అందుచేత నాన్నగారు మరొకర్ని కుదిర్చే వరకు నేననే ఆపని చేయాల్సింది.'

'అయ్యయ్యో! .... నిన్ను చూస్తే జాలి వేస్తోందమ్మా! నీకు నేను సాయం చేయనామ్మా?

పార్వతి మళ్లీ ఫక్కున నవ్వి, చుబుకానికి చేయి ఆనించి, ముద్దుల కొడుకుకేసి కోటి ప్రేమ నేత్రాలతో, ఆప్యాయంగా చూసింది. నున్నటి పాలబుగ్గలు, చెరిగిన క్రాపింగు, పొద్దున్ననగా దువ్వింది సాయంత్రందాకా కుదురుగా ఉంటుందా? కళ్లనిండా అమాయకత్వం. తెల్లటి పాంటుమీద అక్కడక్కడా మట్టి మరకలు. చొక్కా సంగతి సరేసరి— సన్యాసం పుచ్చుకున్నట్టుంది. మోయలేనన్ని పుస్తకాలు. గోపిని చూసేసరికి ఆమె గుండెలో వాత్సల్యం పొంగిపొరలింది. చటుక్కున బుగ్గలమీద ముద్దు పెట్టుకుంది.

'పాపం! .... పదేళ్లు నిండినపండుముసలాడవు. జాలిపడుతున్నావు. బాగుంది—అది సరేకాని కొండంత గొంతుకతో ఎందుకు పిలిచావ్?'

'అమ్మా! అమ్మా! నే నివాళ ఓ గొప్పపని చేశాను.'

'ఏమిట్రోయ్ అది? .... కొంపదీసి మేష్టారడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పావా ఏమిటి? అయితే ఇవాళ వర్షం కురుస్తుంది' అంటూ విరగబడి నవ్వసాగింది.

తన బుద్ధి మాంద్యాన్ని ఎత్తిచూపినందుకు రామం చిన్నబుచ్చుకుని బుంగమూతి పెట్టాడు.

'ఫో! .... అమ్మా! నేను బాగానే చదువుతున్నా. ఈమారు ఒక్క పరీక్షలో కూడా తప్పను చూడు.'

'సరే చూద్దాం. అవతల నాకు బోలెడు పనుంది. అసలు సంగతి చెప్పు.'

'ఓ గొప్ప పనిచేశానమ్మా! బళ్లోంచి వస్తుంటే ఓ ముసిలావిడ, ఓ అమ్మాయి ముందు నడిచిపోతున్నారు. ఉన్నట్టుండి పాపం, ముసిలావిడ కింద పడిపోయింది. ఆ వీధిలో మనుష్యులెవరూ లేరు. గబగబ వెళ్లాను. ఆ అమ్మాయి ఏడుస్తూ 'బామ్మా! .... ఏమైంది?' అనేడుస్తోంది. వాళ్లను చూసేసరికి నాక్కూడా ఏడుపు వచ్చిందమ్మా. ఆ అమ్మాయి నాకంటే పెద్దదే ననుకుంటా. చిరుగు పరికిణీ, చింపిరితల. పాపం, డబ్బులేనివాళ్ళు గామోలు. ఏమైందనడిగితే మరీ ఏడవసాగింది. గబగబ ఎదురుగా ఉన్న ఇంట్లోకి వెళ్లి గ్లాసుడు నీళ్ళు తీసుకొచ్చి మొహంమీద జల్లాను. నెమ్మదిగా లేచి కూర్చుంది .... మిఠాయి కొనుక్కోమని నువ్వు పొద్దున్న అణా యిచ్చావు. జ్ఞాపకం ఉందా? మిఠాయిలమ్మే మనిషి ఇవాళ రాలేదు. దాంతో ఒక సోడా కొని ముసిలావిడ కిచ్చాను. తాగి నన్నెంతో పొగడింది. ఆ అమ్మాయి, నేను చెరో చెయ్యి పట్టుకుని తీసికెళ్లి ఓ అరుగుమీద కూర్చోబెట్టాం. ఆవిడ నాగురించి అడిగితే అంతా చెప్పాను. నాదగ్గర రెండు చాకలేట్లు బాకీఉంటే ఆ అమ్మాయికొకటిచ్చాను. ఆలస్యమైతే నువ్వు కోప్పడతావని గబగబ ఇంటికి వచ్చేశాను.'

పార్వతి ఆశ్చర్యంతో వింది. అనురాగం హృదయాన్ని పూర్తిగా ఆక్రమించుకోగా గోపిని అమాంతం కావలించుకుంది.

'మంచిపని చేశావు. ఆపదలో ఉన్నవార్ని ఆదుకోటం మన ధర్మం. ఎవరూ బోధించకపోయినా నీ కిలాంటి పరోపకార బుద్ధి కలగటం నాకు గర్వంగా ఉంది.....కాఫీ తాగుదువుగాని రా ....'

'వస్తాను కాని, ఆ ముసలావిడ కింద పడితే మళ్లీ ఎవరు సాయపడతారు? అదే నాకు బాధగా ఉందమ్మా!'

'ఎవరో నీలాంటి అబ్బాయి ఎదురుపడతాడు. అదంతా భగవంతుడి కర్తవ్యం. ఆ ముసలావిడతో నువ్వు కలకాలం ఉండగలవా మరి?'

గోపి అర్థమైనట్టు తల వూపాడు.

కాఫీ తాగి, ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని పదినిమిషాల్లో హాల్లోకి వచ్చాడు.

'వకీలు చలపతిగారిల్లు ఇదేనాండి?'

గోపి ఉలిక్కిపడ్డాడు. పార్వతి కంగారుగా వెనక్కి తిరిగింది.

'అవును—ఏంకావాలి మీకు? ఎవరు మీరు'—ముసిలావిడకేసి, అమ్మాయికేసి గోపి పరీక్షగా చూశాడు.

'అమ్మా! .... వీళ్లనే! .... వీళ్ల గురించే ఇంతసేపూ చెబుతున్నా. అదుగో ఆ అమ్మాయి. ఇదుగో అవ్వ!' అంటూ గంతులేశాడు గోపి.

పార్వతి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ముసలావిడ ఇంట్లోకి వచ్చేసింది.

ఆ అమ్మాయి చేతిలో ఉన్న పెట్టెను నేలమీదుంచి చతికిల పడింది.

'నీ కొడుకు చాలా బుద్ధిమంతుడమ్మా! నన్ను రక్షించి ప్రాణదానం చేశాడు. నేను పోతే, ఈ మహాపట్నంలో, నడివీధిలో రుక్కు అడుక్కోవలసిందేగా!' అంది ప్రేమగా ఆ అమ్మాయి తల నిమురుతూ, ముసిలావిడ.

'ఓహో! .... ఈ అమ్మాయి పేరు రుక్కన్నమాట!' అనుకున్నాడు గోపి.

పార్వతి విన్నా, వినకపోయినా ముసిలావిడ ప్రసంగం కొనసాగించింది.

'దానికి నేనే దిక్కు. ఈ డబ్బై ఏళ్లకు పైగా నేనేం చేయగలను? దానికి పన్నెండు దాటాయి. పెంచి పెళ్లిచేసే స్తోమత నాదగ్గ రెక్కడుంది? అదంతా తరువాత మాట్లాడుకుందాం. నాలి కెండిపోతోంది. కాసిని మంచినీళ్ళు తీసుకురామ్మా!'

'పావుగంట క్రితమే కదా బుడ్డెడు సోడా తాగింది..... అప్పుడే దాహమా?' అని ఆశ్చర్యపోయాడు గోపి.

పార్వతి రెండు గ్లాసుల నిండా మజ్జిగ తీసుకొచ్చింది. ఆమె కిదంతా అయోమయంగా కారుమబ్బుల్లో వెలుగులా ఉంది.

'చలపతి ఎన్నింటికి వస్తాడమ్మా?' అంది మజ్జిగ తాగుతూ.

'వచ్చేవేళైంది .... ఆయన్ని మీకు తెలుసా? మీ రెవరో నా కర్థం కావటంలేదు. కాస్త చెబితే బాగుంటుంది.' అంది విసుక్కుంటూ పార్వతి. భర్త వచ్చేవేళకు వంటలక్క వేషంతో ఉండటం ఆమె కిష్టంలేదు. ఎవరో దారినపోయే ముసిల్ది ఆ ఇల్లంతా తన స్వంతమైనట్టు తిష్ఠవేసుక్కూచుంది.

'నే నెవర్నో తెలిస్తే నా వునికిని అసహ్యించుకుంటావ్. అందుకే ఒక్కసారిగా చెప్పలేను. నిజాన్ని నువ్వు సహించలేవు. నువ్వే కాదు. నీ స్థితిలో ఉన్న ఏ స్త్రీ సహించలేదు .... కనక చలపతి వచ్చాక మాట్లాడుకుందాం.'

పార్వతి ఆ యిద్దర్నీ పరీక్షగా చూసింది. ఆమె గుండెలు గబగబ కొట్టుకున్నాయి. సుగుణ ఫోటో ఆమె ఎప్పుడో చూసింది. ఆ పోలికలు రుక్కులో...

'గోపీ! నీకేంపని యిక్కడ? పోయి ఆడుకో!' అని గద్దించింది. అతను కిక్కురు మనకుండా కదలిపోయాడు.

46 పేజీ చూడండి



అన్నీ సిద్ధంగా ఉండాలి .... అబ్బాయిగారికే సేవా పోయుపడ్తాముకే !'

ఇంకా ఎన్నో—ఎన్నో—పదమూడేళ్ళ రుక్కుకు —జీవితంలో ఓడిపోయిన రుక్కుకు—మరింత ఓడిపోటానికి బండెడు బండరాళ్ళు.

'నువ్వు ఈ యింట్లో పనిపిల్లవన్న సంగతి ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకో' అని ముగించింది పార్వతి. రుక్కుకు ఎందుకో గోపిని చూడా లనిపించింది.

అతని జాడే లేదు.

ఆ రాత్రి రుక్కు సగం నిద్రలోంచి మేలుకున్నప్పుడు పన్నెండున్నర.

'రెండో ఆట సినిమా వచ్చాంటే వినడు. మీరు కూడా వాడి పక్షం చేరి సర్వనాశనం చేస్తున్నారు. ఎందుకూ కొరగాకుండా పోతాడు'అంటోంది పార్వతి.

'అమ్మా ! .... ఆ అమ్మాయి నేలమీద పడుకుని నిద్రపోతోంది పాపం ! .... ఆ ముసిలావిడ ఏమైంది? దాన్ని చూస్తే నాకు జాలేస్తోంది' అన్నాడు గోపి.

'ఏడిశావ్ ! .... పనిమనిషిమీద దయా దాక్షిణ్యాలు పనికిరావు. ఆ ముసిలిముండో ఇదివరకు అంటే నువ్వు పుట్టక పూర్వం మనింట్లో పని చేసేది. తిండికిలేక దాని మనవరాల్ని పనిలో పెట్టింది.'

రుక్కు ఆ మాటలు విని చలించలేదు.

* * *

"మహోదయ మాయెనహా ! ఆహా!
శుభోదయ మాయెనహా !
దినదిన కెంజాయల కొన లలమగ
మనలుచు పాకే తొలుసంజ ...."

నిశ్శబ్దంలోంచి తియ్యటి పాట ! తెరచిన కిటికీ లోంచి చల్లటి గాలి గిలిగింతలు పెట్టింది.

దూరంగా 'తెలవారింద' ని కోడి కూసింది.

గోపి చటుక్కున మేలుకున్నాడు.

గదినిండా నీలిరంగు దీపం వెలుగును పచార్లకు పంపింది. దోమతెరలోంచి బయటపడి గడియారం కేసి చూశాడు. అయిదైంది.

కిటికీలోంచి చూశాడు. నిన్నటి 'పనిపిల్ల ముగ్గులు పెడుతోంది. వెన్నెట్లో అందంగా, ఆశ లతల్లా అల్లుకుపోయే ముగ్గులు. తడితడిగా ఉన్న జుత్తు చూసి స్నానం చేసిందని తెలుసుకున్నాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. తెల్లవారు జామున చలిలో హాయిగా పడుకుని నిద్రపోటంలో ఉన్న ఆనందం అమృతం దొరికినా ఉండదు. అలాంటప్పుడు, ఈ అమ్మాయి పిచ్చిదా ఏమిటి ? ఏదో పాడుకుంటూ, ప్రపంచమంతా తనదే నన్నట్టు సంబరపడుతోంది. ? .... ఆమెను చూస్తే మరింత జాలివేసింది. ఆవులింతలతో మళ్ళీ వచ్చి పడుకున్నాడు. పక్కగదిలోంచి పార్వతి పెడుతున్న గుర్రు చెవుల్ని దొలిచివేసింది.

ఏడు గంటలకు రుక్కు గోపిని లేపబోయింది.

'అబ్బాయిగారూ ! లేవండి !' అని పదిసార్లు పిలిచాక గోపి కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చున్నాడు.

'పెద్దైందండి. మీరు పాఠాలు చదువుకోవాలి. బళ్ళోకి వెళ్ళాలి. సూర్యు డుదయించి చురుక్కున పొడిచినా అదేం నిద్రండి ?' అంది రుక్కు.

ఆమె ధైర్యానికి, వ్యాఖ్యానానికి ఆశ్చర్య పోయాడు. మరుక్షణం సిగ్గుపడి, ఆమెను వెంటనే కోపంతో పళ్ళు పటపట కొరికాడు.

'అతని నిద్ర సంగతి నీ కెందుకు ! .... అతన్తో మాట్లాడే హక్కు నీకు లేదని ఎన్నిసార్లు చెప్పటం? రేపో మాపో తన్ని తరిమేస్తాను చూడు' అని గద్దించింది పార్వతి. రుక్కు తల వంచుకుని వెళ్లి పోయింది.

'ఈ అమ్మాయి ధోరణి చూస్తే పనిపిల్లలా లేదు' అనుకున్నాడు గోపి.

ఏడున్నర దాకా కాఫీ తాగి, ఎనిమిదిన్నర దాకా హిందీ పాటలు విని తొమ్మిదింటికి అన్నం తిని రిక్షాలో స్కూలుకు పోయాడు. పుస్తకాల వంక

---

"మా వారు ఎక్కడికి వెళ్లారో తెలియక పదిహేను రోజులు కంగారు పడిపోయా నంటేనమ్మా." అన్నది ఒక ఇల్లాలు స్నేహితురాలితో.

స్నేహితురాలు : ఇంతకూ కనిపించాడా ?

ఆమె : ఒక రోజున ఇంటికి వెళ్లి చూద్దునుకదా అక్కడే ఉన్నారు!!

టి. రామారావు, (విజయవాడ)

---

చూడలేదు. తలితండ్రు లెవరూ అతన్ని మందలించలేదు. రుక్కు అతని జీవిత విధానం చూసి ముక్కుమీద వేలేసుకుంది.

ఆనాటి సాయంత్రం కూడా చలపతి అతన్ని సినిమాకు తీసుకుపోయాడు.

ఇక్కడ ఆ భార్యా భర్తల్ని గురించి కొంత చెప్పవలసుంది. చలపతి మొదటి భార్యను, రుక్కును రుక్కును అప్పుడప్పుడు హాస్యంగా మనసులో తలుచుకుంటాడని, వారికోసం పశ్చాత్తాప పడతాడని పార్వతి వూహించింది. క్రమక్రమంగా మన స్తత్వంలో మార్పులు వచ్చి అతను గోపిని అసహ్యించుకుంటాడేమోనన్న అసందర్భమైన భయం కూడా పట్టుకుంది. అందుకని, గోపి కొండమీది కోతిని తెమ్మన్నా చలపతి తెచ్చేవరకూ ఆమె సాధించేది. మాటిపోటి మాట లనేది. మొదట్లో గోపి భవిష్యత్తుమంచి చిత్రంగా రూపొందాలని చలపతి ఆమెను ఎదిరిస్తూ మందలిస్తూ వచ్చాడు. కాని రోజులు గడచినకొంది అతనికి విసుగెత్తింది. కాపిడి ఉంటేనే కదా నిప్పు పుట్టేది. మనశ్శాంతి కోసం ఆమె అన్నదానికల్లా 'సరే' నని తలూపాడు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గోపి చదువు సంధ్యలు మూసేశాడు. తప్పనిసరిగా స్కూలుకు వెళ్లి ఆ అయిదు గంటలూ ఎలాగో ఒకలాగ కాలక్షేపం చేసేవాడు. తల్చుకున్నప్పుడు సినిమా. క్రమబద్ధమైన జీవితం అతని కలవడలేదు.

ఏదో పూజ ఉండటం వలన ఆ మర్నాడు తొమ్మిదింటికి వంట కాలేదు. బిస్కట్లు తిని పాలు తాగి బడికి పోయాడు. పార్వతి ఆజ్ఞ ప్రకారం రుక్కు కారియర్లో అన్నం తీసుకుని బయలుదేరింది. స్కూలు అక్కడకు అరమైలు దూరంలో ఉంది. ఎండలో నడచి వెళ్ళేసరికి కాళ్ళు కాలిపోయాయి.

'నీకోసం ఎంతసేపని కాచుక్కూచోటం ? తాబేలులా నడుస్తూ వస్తున్నావు. ఆకలితో మాడిపోయి చస్తుంటే' అనరిచాడు గోపి.

అన్నం తినటం పూర్తయ్యాక కారియర్ సర్దింది.

ఇంటికి వెళ్ళాలన్న సంగతి మర్చిపోయి అక్కడే నిలబడిపోయింది. కొందరు విద్యార్థులు ఆనందంతో ఆడుకుంటున్నారు. కొందరు పుస్తకాలు ఎదురుగా తెరచి ఉంచుకుని, తీవ్రంగా వాదించుకుంటున్నారు. అక్కడక్కడా చెట్లకింద ఋషిపుంగవుల్లా కొందరు మాత్రం తపస్సు చేస్తున్నారు. అమాయకత్వం, ఆశాభావం, ఈ రెండూ అక్కడి విద్యార్థుల ముఖాల్లో భవిష్యత్తు వ్రాశాయి. రుక్కు కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

తన వయసులో ఉన్న అమ్మాయి లెందరో కదలిపోతున్నారు. రంగు రంగుల పరికిణీలు, తళుక్కుమనే సిల్కు జాకెట్లు, పొడుగాటి జెడల చివర కొత్త రిబ్బన్లు, తనూ వారిలో ఒకర్తై సముద్రంలో నీటిబొట్టులా కదలిపోతున్నట్టు వూహించుకుని వర్తమానాన్ని మరచింది. వారికి కష్టసుఖాలు తెలియవు. మంచి చెడ్డలు తెలియదు. కన్న తండ్రి యింట్లో పనిమనిషిగా ఉండనక్కర్లేదు. మమకారాన్ని చంపివేసి తమ్ముణ్ణి 'అబ్బాయిగారూ !' అని పిలవ నక్కర్లేదు.

కాని తను వాటన్నిటికీ దూరం.

'ఏమిటలా పిచ్చిగా నిలబడి చూస్తావ్ ? .... ఇంటికి పో ! ఆలస్యమైతే అమ్మ నీవు చీరేస్తుంది' అన్నాడు గోపి. పాకెట్లోంచి గోలీకాయలు బయటికి వచ్చి గాలి పీల్చుకున్నాయి.

రుక్కు కారియర్ తీసుకుని పదడుగులు ముందుకు నడచి వెనక్కి తిరిగి చూసింది. గోపి అక్కడ లేడు. దూరంగా చెట్ల నీడకింద ఆట మొదలెట్టాడు. తను వెళ్ళిందీ, లేనిదీ అతనికి తెలియదు. తిన్నగా వెళ్ళి వో క్లాసు దగ్గర నిలబడింది. ఆ వాతావరణాన్ని వదలిపోయేందుకు మనసొప్పటంలేదు.

ఇద్దరు విద్యార్థులు వో లెక్క తెగక తికమకపడుతున్నారు. ఒకతను ఆ లెక్కను రెండు మూడు సార్లు గట్టిగా చదివి అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇద్దరూ సమస్యా సాధన కోసం మార్గాలు వెతికి విసుగెత్తి పుస్తకాలు మూశారు.

'ఆ లెక్క నేను చేస్తాను. పుస్తకం, పెన్సిలు ఇవ్వండి' అంది చటుక్కున.

ఆ అబ్బాయి లిద్దరూ తెల్ల మొహాలు వేసి చూస్తుండగా రుక్కు నాలుగు స్టెప్పుల్లో ఆన్సరు కనుక్కుంది. గోపి అలా పోతూ రుక్కును చూసి ఆగాడు.

'ఇంకా ఇంటికి వెళ్లలేదూ ? ....'

రుక్కు భయం భయంగా చూసింది. పార్వతికి తెలిస్తే వూరుకోదు.

'ఎవర్రా ఇది గోపీ ! .... చాలా తెలివైన అమ్మాయి సుమా ! నిన్నట్నుంచి ఈ లెక్క తెగక చస్తున్నాం. ఈ అమ్మాయి ఒక్క నిముషంలో చేసిపారేసింది. మీ అక్కయ్యా ఏమిటి కొంపతీసి ?' అనడిగాడు మొదటి విద్యార్థి.

గోపి ముఖం కోపంతో జేవురించింది.

'ఛీ ! .... ఛీ ! .... ఇది నాకు అక్కయ్యేమిటి ? మా ఇంట్లో పనిపిల్ల. మీ కసలు బుద్ధిలేదు. దాన్ని చూస్తే అక్కయ్యలా ఉందా ఏం ?' అని కసిరాడు గోపి.

రుక్కు అక్కడ ఆగకుండా కదలిపోయింది. సాయంత్రం స్కూలు నుండి రాగానే జరిగినదంతా అమ్మతో చెబుతాడని, తనకు దండన తప్పదని భయపడింది కాని అలాంటిదేమీ జరుగలేదు.

రాత్రి ఎనిమిది గంటలు.

పార్వతి హాల్లో రేడియో వింటోంది. చలపతి 'లా' పుస్తకాలు రెఫర్ చేస్తున్నాడు.

వంటింట్లో రుక్కు కూరకాయలు తరుగుతోంది. గోపి నెమ్మదిగా వచ్చి ఆమె ఎదురుగా నిలబడ్డాడు.

'అది సరేకాని రుక్కు ! ఆ లెక్క ఎలా చేయగలిగావ్ ? స్కూల్లో చదువుకున్నావా ? ఆ ఇద్దరబ్బాయిలు మంచి తెలివైనవారు. వారికూడా అర్థంకాని లెక్క నువ్వు చేశావంటే నువ్వు చాలా చాలా తెలివైనదాని వంటాను ....'

అతన్ని వేధిస్తున్న సమస్య అది.

'అదేం బ్రహ్మవిద్య కాదం డబ్బాయిగారూ ! ... నేను రెండోతరగతిదాకా చదువుకున్నా. ఆ తరువాత మా అమ్మ నాకు రోజూ చదువు చెప్పేది. ఆమెకు పెద్ద పెద్ద లెక్కలు కూడా చేయటం వచ్చు. ఇంగ్లీషు బాగా మాట్లాడుతుంది. కాని, ఏం లాభం ! చనిపోయిందండి. నా చదువు ఆగిపోయింది. బామ్మ ముసిల్ది. ఏం చేయగలదు పాపం ?'

గోపి బాధపడ్డాడు. ఆ అమ్మాయి ముఖం చూస్తుంటే తల్లిలేని లోటు బాగా కలబడింది. పనిపిల్లకు, యజమాని కొడుక్కి మధ్య ఉన్న అంతరం మర్చిపోయాడు.

'పోనీ—మీనాన్న ఉండాలికదా ! అమ్మకే చదువు బాగా వచ్చినప్పుడు, నాన్నకు ఇంకా బాగా రావాలి. అతను చెప్పలేకపోయాడా ?'

'అదా ! .... మరి .... మరి .... మా నాన్నకు తీరికుండదు. అస్తమానం ఏదో పని ఉండే ఉంటుంది. అందుకని వీలుపడదు.'

గోపి ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆమె మాటలు నమ్మటం కష్టమన్నట్టు తల అడ్డంగా వూపుతూ 'అది నేను ఒప్పుకోను. మీ నాన్న ఎక్కడున్నాడో చెప్పు. మా నాన్నతో చెప్పిస్తాను' అన్నాడు.

'ఆయన .... ఆయన ....' అంటూ ఆగిపోయింది రుక్కు. చలపతి ఆమె ముందు నిలబడి వికటంగా నవ్వాడు. గోపి ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో ఆమెకు తెలిసింది కాదు.

పదేళ్ల గోపి ఆమె కళ్లవంక, ముఖభంగిమల వంక చూసి చూసి చివరికి ఓ నిర్ణయాని వచ్చాడు.

'నువ్వు చెప్పక్కర్లేదు. నా కర్థమైంది. మీ నాన్నకూడా, అమ్మలాగే చచ్చిపోయాడు. అందుకే నువ్వు దిక్కులేని దానివైపోయావు. నాన్న ఉంటే నాకుమల్లే హాయిగా, దర్జాగా ఉండేదానివి. పాపం ! అతను పోవటంతో ఇలా ఐపోయావు.'

రుక్కు గట్టిగా ఏడవా లనుకుంది. సంభాషణను మరోవంక తిప్పింది.

'అబ్బాయిగారూ ! .... ఈ రెండు రోజులుగా చూస్తున్నా. మీరు ఏడు, ఏడున్నర దాకా నిద్రపోతున్నారు. పెందలాడే లేస్తే ఎంత బాగుంటుందో తెలుసా ? ఆరోగ్యం కూడా .... అలా మొద్దులా నిద్రపోకూడదు.'

మానవుడి మనస్తత్వం వయసును బట్టి మారినా, కొన్ని గుణాలు మాత్రం పుట్టినప్పట్నుంచి స్థిరంగా ఉంటాయి. మాటల్తో అవమానిస్తే చిన్న పిల్లాడు కూడా బాధపడతాడు. అయితే ఆ బాధ చాలా తక్కువకాలం నిలిచి ఉంటుంది.

'ఆ పక్కింటబ్బాయి ఎంత బాగా చదువుకుంటున్నాడో చూడు !—వందకు వంద తెచ్చుకుంటున్నాడు. నువ్వూ పుట్టావు మాకు అన్నీ నున్నలే !' అని తండ్రి ఎగిరిపడితే కొడుకు భయపడటంలోబాటు సిగ్గుపడతాడు కూడా—కష్టపడి చదివేందుకు ప్రయత్నిస్తాడు.

'ఆ పక్కింటబ్బాయికి ఎంత త్వరగా ఉద్యోగం దొరికిందో చూడు ! .... రెండు వందలు సంపాదిస్తున్నాడు. ఆరు నెలలుగా తిరుగుతున్నావు. దరఖాస్తులకు పోస్టు ఖర్చు దండగ' అని తండ్రి ఇరవయ్యేళ్ల కొడుకును మందలిస్తే అదే రియాక్షన్ అతనిలో కూడా కలుగుతుంది.

గోపికి కోపం వచ్చింది. నిన్న వచ్చిన పనిపిల్ల—అందులోనూ వయసులో చిన్నది. తన నిద్ర మీద 'కామెంట్' విసురుతోంది. ఆమె కెంత ధైర్యం ఉండాలి ?

'నోరు మూసుకో ! .... నాగురించి నీ కెందుకు ? అమ్మతో ఒక్కమా టన్నానంటే, వీధిలో అడుక్కు తింటావు. జాగ్రత్త !' అని గదమాయించి బయటి కొచ్చాడు.

రుక్కు నవ్వుకుంది. అతనిలో పరివర్తన వస్తుందని ఆమెకు తెలుసు.

*　　　*　　　*

"పాడవే కోయిలా !
పంచస్వర మెత్తి
పాడవే కోయిలా !
బయలు వచ్చని మ్రాకు
పాటాలకించేని ...."

గోపి మేలుకున్నాడు. మళ్లీ అదే మధురస్వరం. నిశ్శబ్దం వళ్ళు విరుచుకుని లేచి కూర్చుని, నిద్రాభంగ మైనందుకు కళ్ళెర్రచేసింది. కిటికీలోంచి చూస్తే రథం వేస్తున్న రుక్కు కనబడింది. ఆమె పాటలో లయ, తాళం సరిగ్గా ఉన్నాయి. వరస కూడా చాలా బాగుంది.

గడియారం అయిదు కొట్టింది.

ఈ అమ్మాయికి పాట లెలా వచ్చాయి ? తను ఎప్పుడూ వినలేదు కూడా. అతని నిద్ర చెదరిపోయింది. కాసేపు పాట వింటూ అక్కడే నిలబడి తిరిగి మంచంమీద పడుకున్నాడు. ఆమెకూడా ఇంచుమించు తన వయసే. తనకున్న అభిరుచులు, ఆశలు, కోరికలు ఆమెకూ ఉంటాయి. చదువుకోవా లనుంటుంది. మంచి మంచి దుస్తులు ధరించి సుఖంగా తిరగాలనుంటుంది. చిరుగు పరికిణీ, అతుకులబొంత జాకెట్టు ఆమెకూ నచ్చదు.

'కాని ఆమె ఏం చేయగలదు ? .... ఆమెకు తలిదండ్రులు లేరు పాపం !' అని సమాధానపడ్డాడు.

నిన్నటివరకూ అసహ్యించుకున్న రుక్కుమీద ఒక్కసారిగా జాలి, అభిమానం పుట్టుకొచ్చాయి.

అతనికి తెలియకపోయినా ఇద్దరూ ఒకే తండ్రి బిడ్డలు !

నెమ్మదిగా అరుగుమీద కొచ్చాడు.

'నీ పాట చాలా బాగుంది' అన్నాడు.

రుక్కు ఉలిక్కిపడింది.

'అబ్బాయిగారూ ! ఇంత పెందలాడే ఎందుకు లేచారు ? అమ్మగారికి తెలిస్తే కోప్పడతారు. నాతో మాట్లాడకండి.'

గోపి నవ్వాడు. నిజానికి అతన్ని చూసి అమ్మే భయపడాలి !



'నువ్వు నాలాంటిదానివే కదా ! .... ఎందు కింత పొద్దున్న లేచి పనిచేస్తున్నావ్ ?'

'నా కది చిన్నప్పట్నుంచి అలవాటు. ఇలా చీకట్లో చలిగాలిలో నిలబడటం ఎంత హాయిగా ఉంటుందో తెలుసాండి ? సందడి ఉండదు. నిశ్శబ్దంగా ఉంటుంది. మనుష్యులు అక్కడక్కడ ఉన్నా గుంపులుగా కనపడరు. అలాంటప్పుడు చదువుకుంటే పాఠాలన్నీ ఇట్టే అర్థమవుతాయి. ఒక్కసారి చదివితే చాలు—కలకాలం జ్ఞాపకం ఉంటాయి.

గోపి శ్రద్ధగా విన్నాడు. రుక్కు మాటలు నూటికి నూరు వంతులు సరనిపించాయి. మనసుకు, శరీరానికి ఆ ఉషఃకాలపు శీత పవనాలు ఎంతో ఆహ్లాదాన్ని, మైమరపును కలిగించాయి. అలా విడిచిపోవా లనిపించిం దతనికి.

'నీ మాటలు నిజం సుమా ! .... రేపట్నుంచి నేనూ అయిదింటికి లేస్తాను. అదలా ఉంచి ఈ పాటలన్నీ నీకెలా వచ్చు ?'

రుక్కు నవ్వింది.

'మా యింటి పక్కన ఒకాయన ఉండేవారు. ఆయనకు పాతికేళ్ళుంటాయి. ఆయన పాటలు రాస్తారు. పెద్ద పెద్ద కవులు రాసిన పాటలన్నీ చదువుతారు. వాటికి వరస, మెట్లు కట్టి బాగా పాడతారు. నన్ను అప్పుడప్పుడు పిలిచి పాటలు నేర్పుతాడు. ఇవన్నీ ఆయన దగ్గర నేర్చుకున్నవే. అమ్మ మనసు బాగా లేనపుడు నన్ను ఏదైనా పాడమంటుంది. ఆ పాటల్లో ఉండే అర్థం నాకు పూర్తిగా తెలియకపోయినా పాడుతున్నంతసేపు ఎంతో ఆనందంగా, అదోలా ఉంటుంది.'

'అవన్నీ నేనూ నేర్చుకుంటాను' అనుకుంటూ లోపల కొచ్చాడు.

ఆ ఉదయం స్కూలుకు పోయేముందు—

'అమ్మా ! నాకు తొమ్మిదింటికి ఆకలవటం లేదు. అన్నం సయించటంలేదు' అన్నాడు గోపి.

పార్వతి ఆశ్చర్యపోతూ 'పోనీ—పొద్దున్న బిస్కట్లు తినటం మానేసి వట్టి కాఫీయే తాగు' అంది.

గోపి అడ్డంగా తలూపుతూ 'అదేం కుదరదు. నాకు స్కూలుకు కారియర్ పంపమ్మా ! అన్నాడు నిశ్చయంగా.

పార్వతి సమ్మతించింది. / ఆనాటికి అన్నం తిని వెళ్లమని, మర్నాటి నుండి ఈ కొత్త పద్ధతి మొదలుపెటదా మంది.

ఆ మర్నాటినుండి రుక్కుకు ఈ పనికూడా వప్పచెప్పబడింది.

రుక్కు క్రమక్రమంగా తన ఉనికి వలన కలిగే ప్రభావాన్ని అతనిమీద చూపసాగింది. స్కూల్లో ఆమె అందరికీ పరిచయమైంది. తెగని లెక్కలు సాధించటం, డ్రాయింగు పుస్తకంలో చక్కగా బొమ్మలు వేయటం, కొత్త కొత్త పాటలు వినిపించటం. స్కూల్లో ఉన్న ఆ రెండు గంటలూ ఆమెకు స్వర్గంలో విహరిస్తున్నట్టుండేది. కొందరు అబ్బాయిలు ఆమెకు పిప్పరమెంట్లు, చాకలేట్లు పంచిపెట్టారు. గోపి లోలోన అసూయపడ్డా అది మంచికే దారితీసింది. అలారం గడియారాన్ని అయిదింటికే గంట వాయించమని ఉత్తరువు జారీచేశాడు, సోమరితనాన్ని దూరంగా

# రాగద్వేషాలు

నెట్టివేసి చదువుకో నారంభించాడు. అతను వద్దన్నా, పార్వతి తెలియకుండా బొమ్మలు వేసేది. కొన్ని పాఠాలు చదివి వివరించేది.

అలా నెల రోజులు గడిచాయి.

ఓనాడు మధ్యాన్నం అన్నం తిని గోపి తిన్నగా చెట్టుకింద కూర్చున్నాడు. మూడో గంట కొట్టినా క్లాసుకు వెళ్లలేదు. రుక్కు ఆశ్చర్యపోయింది.

'అబ్బాయిగారూ !—టైమైంది. క్లాసుకు వెళ్లలేదేం ?' అనడిగింది.

అరచేయి చూపించాడు. ఎర్రటి రక్తపు జీరలు కనిపించాయి. అతని ముఖంనిండా చిత్రమైన భావాలు కనపడ్డాయి.

'అర్థమైందా లేదా ? .... హోంవర్కు చేయలేదని ఇంగ్లీషు మాస్టారు కొట్టాడు. కుర్రాళ్లను కొడితే జైలుకు పంపిస్తారని తెలియదు గామోలు ! నాన్నగారు రాగానే చెప్పి సంగతేమిటో కనుక్కోమనాలి.'

రుక్కు అర్థం చేసుకుంది. పార్వతి కొడుకు కోసం ఏమైనా చేస్తుంది. ఏ ఉపాధ్యాయుడూ విద్యార్థిమీద చేయి చేసుకోకూడదు. చట్టం, న్యాయం గోపివైపే ఉంటుంది.

'అబ్బాయిగారూ ! మీరు మీ కర్తవ్యం నెరవేర్చనందువల్లనే కదా మేష్టారు దండించారు, మీరు ఏ తప్పూ చేయనప్పుడు ఆయన శిక్షిస్తే అయ్యగారితో చెప్పటం న్యాయం. మీకంటె వయసులో విజ్ఞానంలో ఉన్నత స్థితిలో ఉండి, మీకు మార్గదర్శకులుగా ఉన్న గురువుమీద పగ తీర్చుకోవాలనుకోటం పొరపాటు కదా ! మీరే బాగా ఆలోచించండి. ఆయన మీ మంచికోసమేగా కొట్టింది ! కనక బుద్ధిగా క్లాసుకు వెళ్లండి. రేపట్నుంచి హోంవర్కు సరిగ్గా పూర్తిగా చేయండి. చదివితే తప్పకుండా మీకు ఫస్టు మార్కులు వస్తాయి' అంది రుక్కు.

గోపి ఆమెకేసే రెండు నిమిషాలు తీక్షణంగా చూశాడు. తరువాత పుస్తకాల సంచీ తీసుకుని నెమ్మదిగా నడుస్తూ తన క్లాసుకు పోయాడు. రుక్కు నిట్టూర్చి ఇంటికి బయలుదేరింది.

ఆనాటినుండి గోపి చిత్రంగా మారిపోయాడు. ఎవరితోనూ అనవసరంగా మాట్లాడడు. ప్రతి దానికీ పంతంపట్టి నెగ్గించుకోడు. తీరిక దొరికినప్పుడల్లా దీక్షగా పుస్తకాలు చదివేవాడు. పార్వతి అతనిలో అలల పరంపరలా వస్తున్న మార్పుల్ని చూసి ఆశ్చర్యపోయినా, వెనక ఉండి కదలించే శక్తి గురించి ఆలోచించలేదు. ఆ నిజాన్ని కనుక్కుంది ఒక్క చలపతి మాత్రమే.

ఓనా డుదయం రుక్కు కనిపించలేదు.

వంటింటో అమ్మ సతమత మవుతోంది. పక్క గదిలోంచి మూలుగు విని గోపి ఆశ్చర్యపోయాడు.

'అమ్మా ! .... రుక్కు ఏమైంది ?' అనడిగాడు.

'దానికి మాయదారి జ్వరం వచ్చిందట. పోయి పడుకుంది. ఇంటి పనంతా నా తలమీద—పని మనిషి ఉండి ఏం లాభం ?' అని విసుక్కుంది పార్వతి.

'అయ్యో ! .... దానికి జ్వరం వచ్చిందా పాపం ! అదే గామోలు మూలుగుతోంది' అంటూ పరుగెత్తాడు. పార్వతి మొదట్లో విస్తుపోయి తరువాత కోపంతో పళ్ళు పటపట కొరికింది. ఓమారు తను వంట చేయటం చూసి 'అయ్యయ్యో ! .... నిన్ను చూస్తే జాలివేస్తోందమ్మా ! నీకు నేను సాయం చేయనామ్మా ?' అనడిగిన కొడుకు ఈమారు తన ఉనికినే మరచి పనిపిల్లకోసం పరుగెడుతున్నాడు. ఆమె ఎలా సహించగలదు ?

గదిలో నేలమీద పడుకొని రుక్కు మూలుగుతోంది. వళ్లంతా గజగజ వణకుతోంది. ఒకడుగు దూరంలో నిలబడేసరికి వేడిగాలి అతన్ని చుట్టివేసింది. కళ్ళు మూసుకుని బాధతో ముఖంమీది చర్మాన్ని ముకుళింప చేస్తోంది.

'రుక్కూ ! .... జ్వరం ఎప్పుడు వచ్చింది ? కాఫీ తాగావా !' అనడిగాడు.

పనిపిల్ల కళ్ళు తెరచి చూసి చిన్నగా నవ్వింది.

'నిన్న రాత్రి వచ్చిందండి అబ్బాయిగారూ !.... ఇంకా తాగలేదండి' అంటూ మళ్లీ కళ్ళు మూసుకుంది. ఆమెను మాట్లాడించకూడదని మళ్లీ వంటగదిలోకి వచ్చాడు. అమ్మ ఏదో సణుక్కుంటూనే ఉంది. ఆమెకీ పని అలవాటు లేదు మరి.

'అమ్మా ! రుక్కుకు కాఫీ ఇవ్వలేదట. తీసుకువెళ్లనా ?'

పార్వతి కళ్ళెర్రజేసింది.

---

ఒక పెద్దమనిషి డాక్టరు దగ్గరికి వెళ్లి 'ఈ కలలతో చికాకెత్తి పోతోందంటే నమ్మండి! ఏదో నిర్జనప్రదేశంలో ఉన్నట్టూ నా చుట్టూ అందమైన అమ్మాయిలు తిరుగుతున్నట్టూ ఒకటే కలలు వస్తున్నాయి. వీటి పీడ ఎలా వదులుతుందో చెప్పండి! అని మొరపెట్టుకున్నాడు.

డాక్టర్:-అదేమిటి? అంత చక్కని కలలు వస్తుంటే దిగులు పడతారు దేనికి!

రోగి:-ఏమి చేప్పమంటారు! నేనూ వాళ్ళలో ఒకరుగా కనిపిస్తున్నందుకే ఈ దిగులు అంటాను!

ఎం. విశ్వేశ్వరావు (రాజమండ్రి)

---

'ఏం ! నీతో ఫిర్యాదు చేసిందా ? .... గ్లాసులో ఉంది తీసికెళ్ళు.'

గోపి కాఫీ తీసుకుని వెళ్ళబోతూ 'అమ్మా ! .... రుక్కు నేలమీద పడుకుంది పాపం ! మంచంమీద పడుకోమందామా ?' అనడిగాడు.

పార్వతికి వళ్ళు తెలిసింది కాదు.

గబగబ పక్క గదిలోకి వెళ్ళింది.

'ఏమే రుక్కుముండా ! నీకు పడుకోటానికి పూలపాన్పు కావాలటే ? .... గోపిచేత రాయబారం పంపుతున్నావ్ ! ఇంకా ఏం కావాలి ? బత్తాయి రసం, మంచి మందులు, కాశ్మీర్ కంబళం, వింజామరంతో విసిరేందుకు ఇద్దరు నౌకర్లు. అవునా ?. జాగ్రత్త ! ఈసారి వాడితో ఏమన్నా అన్నావంటే ఇంట్లోంచి గెంటేస్తాను. ఆ ముసల్ది నువ్వు కుక్కిన పేనులా ఉంటావని హామీ యివ్వబట్టి ఉండనిచ్చాను. ఉండేకొలది నెత్తి నెక్కుతున్నావు.'

గోపి ఈ పిడుగుల చప్పుడు విని భయంతో చేతవున్న కాఫీ గ్లాసు నేల విడిచాడు.

కాఫీ నేలమీద నదిలా పాకిపోయింది. రుక్కు అంతా వింటూ చూస్తూ చలనరహితంగా అలాగే పడుకుంది. అమ్మ రౌద్రాకారం చూసి కొడుకు జడుసుకుని నోరు మూసుకున్నాడు.

చివరకు తెగించి—

'అమ్మా ! .... వోమారు రుక్కు బామ్మకు రోడ్డుమీద సాయం చేస్తే, నువ్వే కదా 'మంచిపని చేశావు. ఆపదలో ఉన్నవార్ని ఆదుకోటం మన ధర్మం ! ఎవరూ బోధించకపోయినా నీ కిలాంటి పరోపకార బుద్ధి కలగటం నాకు గర్వకారణంగా ఉందన్నావు' అనడిగాడు.

'నోరుముయ్ !' అని గద్దించింది పార్వతి.

అంతకుమించి ఆమె అనగలిగిం దేముంది ?

* * *

ఆరు నెలలు గడిచాయి.

రుక్కు జీవితం 'పనిపిల్లగా' ఆ యింటో స్థిరపడింది. చలపతి, పార్వతి, గోపి ఈ ముగ్గురి మనస్తత్వాల కనుగుణంగా ఆమె నడచుకుంది. గోపి మాత్రం ఆమెతో చనువుగా ఉంటున్నాడు. నాన్న కోర్టుకు, అమ్మ గుళ్ళోకి వెళ్ళినప్పుడు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకుంటూ కూర్చునేవారు. రుక్కు తియ్యగా పాడేది. ఆమె దగ్గర్నుండి రెండు మూడు పాటలు తనూ నేర్చుకున్నాడు.

ఇక పార్వతి.

అదను దొరికినప్పుడల్లా కసిరికొడుతూ, సూటి పోటి మాటల్తో ఎత్తి పొడుస్తూ నూటికి నూరు వంతులు సవిత్తల్లనిపించుకుంది. ఆ చిన్ని గుండెలో వీళ్ళైనన్ని సూదులు గుచ్చి, చిన్నాభిన్నం చేసి జీవితంమీద విసుగెత్తించజేసి తరిమివేయాలని కంకణం కట్టుకున్నట్టు కనపడింది. ఒక్కరోజు రుక్కు నిద్రలేవటం ఆలస్యమైనా, పనిలో ఏదైనా చిన్న పొరపాటు జరిగినా ఆమెకు గండం తప్పేదు. దండన ఖాయం. అగ్నిజ్వాలల్లో పూర్తిగా మాడ్చివేయక, సెగలు పొగలు కమ్ముకుని ఉక్కిరి బిక్కిరయేట్టు చేసేది. ఏదో ఒకనాడు ఆమె చలపతి కూతురన్న విషయం బయటపడక మానదు. విసిగి వేసారి రుక్కే ఈ సంగతి బహిరంగం చేయవచ్చు. అప్పుడు లోకం విమర్శించి ఆమెకు పెళ్ళిచేయమంటుంది. ఆ ఘడియ రాక మునుపే తరిమికొట్టాలనుకుంది.

ఇక చలపతి—

అతను ఆత్మను మరచిపోయాడు. రుక్కును చూస్తే గుండె తరుక్కుపోయేది. ఆయింటో ఆమెకు, గోపికి సమానాధికారాలున్నా 'బానిస' కన్న నిమ్మరంగా బతుకుతున్న కూతుర్ని చూచి కన్నీరు కార్చటం తప్పించి అతనేమీ చేయలేక పోయాడు. అధికారం చలాయించటానికి ప్రయత్నిస్తే సాఫీగా నడచిపోతున్న సంసారంలో తుఫాను రేగుతుంది. దానికి అంతమంటూ ఉండదు.

'సుగుణ నిన్ను తిరస్కరించింది. మనిషన్న వాడు పొరపాటు చేస్తాడు. అంతమాత్రంచేత ఆమె నీమీద పగ తీర్చుకోవాలనుకోటం మహాపరాధం. అందుకే కూతురు అనుభవిస్తోంది. అనుభవించనీయి. అని 'అహం' ప్రబోధించింది.

'అది తప్పు. తల్లి చేసిన తప్పుకు కూతుర్ని దండించమని ఏ న్యాయంలో ఉంది ?' అని అంతరాత్మ గర్జించింది.

ఈ రెండు శక్తుల మధ్య యిరుక్కుని చలపతి ఏం చేయలేక వూరుకున్నాడు. పార్వతిని మందలించలేదు. రుక్కుమీ దుండే ప్రేమను బయటికి ప్రదర్శించలేదు.

ఓనాడు రాత్రి—

'కోయిల కోయిలా
కూయబోకే
గుండెలూ బద్దలూ
చేయబోకే !'

రుక్కు మెల్లిగా పాడుకుంటోంది.

గోపి పరుగు పరుగున వచ్చి 'ఏయ్ ! పనిపిల్లా' అని పిలిచాడు.

అతని చేతిలో పెద్ద పాకెట్ ఉంది. రుక్కు వెనక్కి తిరిగిచూసేసరికి గతుక్కుమన్నాడు.

'ఏడుస్తున్నావా రుక్కు ?' అనడిగాడు.

'ఏడుస్తున్నానా ? అబ్బే ! లేదే ! కంటో ఏదో నలుసు పడింది గామోలు !' అంది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'చట్ ! .... నాతో ఎవ్వరూ అబద్ధ మాడలేరు. తెలిసిందా ? నువ్వు నిజంగా ఏడుస్తున్నావు? ఎందుకో ముందు చెప్పు' అని గద్దించి అడిగాడు గోపి. అవును మరి. అక్కయ్య దుఃఖం అమంగు తమ్ముడు తెలుసుకోవద్దూ ?

'బామ్మ జ్ఞాపకాని కొచ్చింది.'

'ఆ ముసిల్దాని కోసం ఏడుస్తున్నావా ?'

'మీకు తెలియదండి డబ్బాయిగారూ ! బామ్మ నన్ను కంటికి రెప్పలా కాపాడింది. జ్ఞాపకం రాకుండా ఉండాలని ఎంతో ప్రయత్నిస్తున్నాను. కాని లాభంలేదు. అబ్బాయిగారూ ! ఓసారి బామ్మను చూడాలనుందండి .... కాని అమ్మగారు ఒప్పుకోరు. అడిగి లాభంలేదు.' అని కళ్ళు తుడుచుకుంది. గోపి చేతిలో ఉన్న వస్తువు ఆమె కంటపడింది.

'ఆ పాకెట్ ఏమిటండి ?' అనడిగింది.

'నీతో చెబుదామనే వచ్చాను. ఎల్లుండి నా పుట్టినరోజు. నాన్న కొనుక్కొచ్చిన బహుమతి' అంటూ పాకెట్ విప్పి చూపించాడు. అందులో నో పంట్లాం, చొక్కా, టై ఉన్నాయి.

'ఇది వెల్వెట్ పంట్లాం—ఇది టెరిలిన్ చొక్కా—ఇదిడెకొరాన్ టై' అని వివరించాడు.

చాలా బాగున్నాయండి. వచ్చేవారం ఇదేరోజు నా పుట్టిన రోజు' అంది ఆలోచిస్తూ.

'అది నీకెలా తెలును ?'

'బామ్మ ఎన్నోసార్లంది. వచ్చే బుధవారంనాటికి నాకు పదమూడేళ్ళు నిండుతాయి.'

పార్వతి హాల్లోంచి అతన్ని పిలుస్తోంది కాని అతను వినిపించుకోలేదు.

'మీ బామ్మ ఏం బహుమతి పంపుతుంది ?'

రుక్కు నవ్వుతూ 'బామ్మ బీదరాలు. దాని దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు. ఆమె నా కివ్వగలిగింది దీవెనలు మాత్రమే. అవి వజ్రాల కంటె విలువైనవి.'

పార్వతి వచ్చేసింది.

'ఇవన్నీ దాని కెందుకు చూపిస్తావ్ ? .... అసలే దానివి దిష్టికళ్ళు' అని కసిరింది. రుక్కు తన పనిలో మునిగింది.

బుధవారం గోపి పుట్టినరోజు గొప్పగా జరిగింది. పొద్దున్నే పురోహితుడు వచ్చి మంత్రాలు చదివి హోమం చేశాడు. సాయంత్రం చలపతి మిత్రులు, చుట్టు పక్కలవారు విందుకు వచ్చారు. గోపి చక్కగా ముస్తాబై పాశ్చాత్యుల ఆచార ప్రకారం 'కేక్' కోశాడు. అందరూ చప్పట్లు చరిచారు. అందరూ సరదాగా సంతోషంగా ఉన్నారు.

గోపి ముందు బోలెడు బహుమతులు.

అతను రుక్కు కోసం గదంతా వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. అమ్మ నడిగితే 'నోరు మూసుకో' అంది. ఆమెతో వాదన మొదలెడితే నలుగురూ విని వివరా లడుగుతారని వూరుకున్నాడు.

మరో పావు గంటకు ఆమె గుమ్మం దగ్గర కనపడింది.

అదే చిరుగు పరికిణీ, చుక్కల కుట్టు జాకెట్టు, చింపిరి తల, కళ్ళల్లో కొంత ఆనందం, కొంత దైన్యం.

'వచ్చే బుధవారం గోపి కూర్చున్న సోఫాలో నేనూ కూర్చోవలసింది' అనుకుంది.

పార్వతి రూపం పెరిగి పెద్దదై ఆమెను బెదరగొట్టింది.

'ఛీ ! .... ఇక్కడుండలేను. బామ్మ నన్నెందు కిక్కడ తీసుకువచ్చింది. మరో యింట్లో పని మనిషిగా ఉన్నా కాస్త మనశ్శాంతి ఉంటుంది. తన కున్న స్థానం అర్థమయ్యాక ఇదంతా చూస్తూ సహిస్తూ ఎలా ఉండటం ?'

ఆమె చిన్ని గుండె భోరుమంది.

పార్వతి రుక్కును గమనించింది.

'ఏమే ! .... ఇప్పు డెందు కిక్కడ తగలడ్డావ్ ? అందరూ వెళ్ళాక గది వూడ్చి శుభ్రం చేయటానికి పిలుస్తాను. ఫో !' అనరిచింది. చలపతి ఎటో చూస్తున్నాడు.

ఆ మర్నాటి నుంచి రుక్కు పరధ్యానంగా ఉన్నా, ఆ నిజాన్ని గమనించింది ఒక్క గోపి మాత్రమే. ఇదివరకటికి మల్లే ఆమె ఎక్కువగా మాట్లాడేది కాదు. పాటలు పాడటం అసలు మానివేసింది.

**PAKCO** ప్యాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాష్ ఫ్యూయల్ ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams : LAMP **K. S. SHIVJI & CO.** (Estd. 1903)
Phone : 22017 పోస్టుబాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు.

**రెమి**

**సౌందర్యపోషణ సాధనాల్లో**

ఒకటి
డస్టింగ్
పౌడరు




మలయాలో లభించు ప్రదేశము :
మెసర్సు మీనా ట్రేడింగ్ కంపెనీ,
50-ఎ, మార్కెట్ రోడ్, సింగపూరు-1.

సిలోనులో లభించు ప్రదేశము :
ఎ. వి. ఆర్. ఎ. లిమిటెడ్,
కొలంబో.

రెమి హాస్యనాటకం ప్రతి శుక్రవారం రేడియో సిలోను 41.72 మీటర్ల మీద సా॥ 6-30 నుండి 6-45 గంటలవరకు వినండి.

# రాగద్వేషాలు

బుధవారం వచ్చేసింది.

రుక్కు యథాప్రకారం పొద్దున్నే స్నానంచేసి పెట్టెలో ఉన్న పరికిణీ కట్టుకుని, జాకెట్టు తొడుక్కుంది. చిరుగులున్నా, ఉన్నవాటిల్లో నయం. దేవుడికి నమస్కరించింది. జొమ్మను తల్చుకుంది. అంతటితో ఆమె జన్మదిన మహోత్సవం పూర్తయింది.

ఆ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేరు.

రుక్కు మాత్రం అన్నం వారుస్తోంది.

గోపి ఓ పాకెట్ తీసుకొచ్చాడు.

'నిన్ను చూస్తే నాకు జాలివేస్తుంది. పాపం! 'పుట్టినరోజునాడు నీకు పెలవైనా లేదు.'

రుక్కు అన్నం మూతపెట్టి వచ్చింది.

'ఇదుగో ! .... నీకు నా బహుమానం !' అంటూ పాకెట్ అందిచ్చాడు.

రుక్కు అనుమానంతో అందుకుని విప్పి చూసింది. తళతళ మనే సిల్కు పరికిణీ, జాకెట్టు. అయిదు నిమిషాలవరకూ మౌనంగా ఉండి పోయింది.

'ఎంతకొన్నారండబ్బాయిగారూ !'

'పదిహేను రూపాయలు !' అన్నాడు సంబరంతో. అతని మనసంతా గర్వంతో నిండి పోయింది. కాళ్ళు భూమ్మీద లేవు. ఆకాశంలో తేలి పోతూన్న అనుభూతి.

'మీ కింత డబ్బెక్కడిదండి ?'

గోపికి కోపం వచ్చింది. ఈ అమ్మాయికీ చెప్పదంట ప్రశ్నలన్నీ ఎందుకు ? ఏదో దొరికింది కదాని సంతోషపడక.

'నాన్నిచ్చారు.'

'నాకు కొనిమ్మనా ?'

'అబ్బబ్బ ! .... అందంతా నీకెందుకు ? నాన్న కోటుజేబులోంచి తీశాను. ఆ సంగతి నాన్నకు తెలియదు. తెలిస్తే మాత్రం ఏం కొంప మునిగి పోతుంది ? ఎక్కడో పారేసుకున్నా ననుకుంటారు. అంతేకాని నన్నెవరూ అనుమానించరు.'

'అబ్బాయిగారూ ! .... ఇవి మీరే తీసుకోండి. నా కక్కర్లేదు. అమ్మగారికి తెలిస్తే ఏమవుతుంది ? అన్నీ అడిగి తెలుసుకుంటారు. మిమ్మల్నే దండిస్తారు.'

'మీ బామ్మ కొనిచ్చిందని చెప్పేయ్.'

'దొంగతనం చేయకూడదండి .... మీరు చేసిన పని తప్పు. దుకాణంలో యివి తిరిగిచ్చేసి డబ్బు తెండి. నాన్నగారు వచ్చేలోగా పాకెట్లో గప్‌చిప్‌గా ఉంచేద్దాం.'

గోపికి ఆమెను నమిలి మింగేయా లనిపించింది.

'నా కెందుకీ అవస్థ ? నువ్వే ఎలాగో ఏడు.' అని పోబోయాడు.

'అలా కాదండి .... అమ్మగారి కిచ్చేసి క్షమాపణ వేడుకోండి.'

అది కూడా నువ్వే చెయ్యి. ఛీ ! చెత్త పురుగు!' అని రుసరుసమని పోయాడు. అతని ఆశయం మంచిదే. కాని పర్యవసానం వూహించలేదు. తన బహుమానాన్ని రుక్కు తిరస్కరిస్తుందని అత

ఏమ్మాత్రమూ వూహించలేదు. పనిపిల్ల కనక, దక్కింటే భాగ్యమని సంబరపడుతుం దనుకున్నాడు.

*   *   *

గోపి వూహించినట్టే జరిగింది.

పార్వతి ఇంటికి రాగానే రుక్కు జరిగినదంతా వివరించింది. ఆమెకు నాలుగు మొట్టికాయలు దొరికినా బాధపడలేదు.

తలిదండ్రులు గోపిని సంజాయిషీ అడిగారు.

'నా తప్పేమీ లేదమ్మా! అదే నన్ను కొనుక్కురమ్మని చంపుకుతింది. పనిపిల్లకదాని జాలిపడ్డాను.' అన్నాడు ఏడుస్తూ.

కాని చీవాట్లు, దెబ్బలు తప్పలేదు.

'వాణ్ణింక అదుపులో ఉంచాలి. చిన్నపిల్లాడు దాని గారాబంగా చూస్తే నెత్తి నెక్కుతాడు' అనరిచాడు చలపతి.

'పూర్తిగా వాణ్ణని లాభంలేదు. ఆ ముండను వెళ్ళగొట్టాలి. అదే నా కొడుకు నిలా చేయిస్తోంది.' పార్వతి రుక్కును చూపులతో కాల్చివేసింది.

ఆ రాత్రి గోపి నిద్రపోలేదు. అతన్ని అవమానం, సిగ్గు, కోపం అన్నీ ఆవరించాయి. ఈ నాలుగు నెలలుగా రుక్కుమీద ఏర్పడిన ఆప్యాయత, అనురాగం అంతరించాయి. ఆమెకోసం అతను తీసుకున్న శ్రద్ధాసక్తులన్నీ ఒక్కటొక్కటే జ్ఞాపకానికి వచ్చాయి. రుక్కును చదివించాలని అమ్మతో ఎన్నో సార్లు వాదులాడాడు. ఆమె చుట్టూ గోడ కట్టి కాపలా కాశాడు. .... ఒక్కసారైనా అతన్ని తలిదండ్రులు దండించలేదు. ఆమె మూలంగా దెబ్బలు తినవలసి వచ్చింది. పనిపిల్ల తన్ను ధిక్కరించి ఎదిరించటం అతను సహించలేకపోయాడు. రుక్కుమీద పగ తీర్చుకోవాలన్న కోరిక ఎక్కువైంది.

'దొంగతనం చేయకూడదట!' అనుకున్నాడు.

ఆ దొంగతనం రుక్కు ఎందుకు చేయకూడదు. పనిపిల్ల కనక ఆమె 'దొంగ' ని అందరూ ఒప్పుకుంటారు.

మంచంమీద నుండి లేచి గడియారం వంక చూశాడు. పన్నెండైంది. అమ్మ గట్టిగా గుర్రు పెడుతోంది. రుక్కు వంటింటో ఒమూల పడుకుని అలసిన వంటిని నిద్రలో ఐక్యం చేసింది. అంతటా నిశ్శబ్దం. ఆ క్షణంలో అతనేం చేసినా ఎవరికీ తెలియదు. రుక్కు అన్నమాటలన్నీ అతని చుట్టూ నిలబడి పిశాచాల్లా గంతులేశాయి.

మనిషన్న తరువాత—

చిన్నవాడైనా, పెద్దవాడైనా—

అనుభూతు లొక్కటే.

నెమ్మదిగా అడుగులు వేస్తూ నడిచాడు. మధ్య మధ్య ఆగి తన్నెవరైనా గమనిస్తున్నారేమో నని చూశాడు. అందరూ ప్రగాఢ సుషుప్తిలో మునిగి ఉన్నారు. చప్పుడు చేయక మేడమెట్లెక్కాడు. అక్కడే రుక్కు పెట్టె ఉంది. అందులోనే ఆమె 'ఖజానా' మూలుగుతోంది. తన వేలి ఉంగరాన్ని పెట్టెలో పడేశాడు. వంటింటో అలికిడైంది. అతని గుండెనలా గబగబ కొట్టుకున్నాయి. అడుగుల చప్పుడు చెవులకు మరింత దగ్గరగా వస్తోంది. త్వరత్వరగా మెట్లు దిగసాగాడు.

'అమ్మోయ్! ....' అని పెద్ద కేక.

నిమిషంలో దీపాలు వెలిగాయి. పార్వతి, చలపతి, రుక్కు పరుగెత్తుకుంటూ వచ్చారు.

గోపి మెట్లకింద స్మృహలేకుండా పడివున్నాడు. పార్వతి గుండెలు బాదుకుంది. చలపతి డాక్టరు కోసం పరుగెత్తాడు.

*   *   *

చేతికి కట్టుకట్టి మంచంమీద పడుకోబెట్టారు. డాక్టరు ఎముక విరిగిం దన్నాడు. రుక్కు మనసు కూడా విరిగింది. ఆ రాత్రంతా గోపి వళ్ళు తెలియకుండా పడిఉన్నాడు. అర్ధరాత్రి నిద్రలేచి మేడమీద కెందుకు వెళ్ళాడో ఎవరికీ తెలిసింది కాదు. ఊహించేందుకూ ఆ కారణాలు దొరకలేదు. పార్వతి మాత్రం 'అంతకూ కారణం ఆ పీడముండే! దానితోబాటు ఇంటో శని ప్రవేశించింది. అది పోతే కాని పీడ విరగడవదు. చివరకు నా కొడుకు ప్రాణాలకే అపద వచ్చింది.' అని వాపోయింది. చలపతి దిగాలుపడి కూర్చున్నాడు. రుక్కు ఎవరికీ కనపడకుండా వంటింటో బెదురుతూ ఉండిపోయింది.

ఆ మర్నాడు 'బోన్ సెట్టర్' దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఎముకనుసరి చేసి 'బాండేజీ' కట్టి పది రోజులు కదలకుండా ఉండాలన్నాడు. ప్రతి క్షణం భయంతో పెద్దదవుతూ 'ఇదిగో పగిలిపోతా' నని బెదరిస్తోంది.

పార్వతి మంచం దగ్గర కూర్చుని 'మేడమీది కెందుకు వెళ్ళావురా నాయనా? ....' అని పదే పదే అడిగింది. అతను సమాధానం చెప్పక వూరుకున్నాడు.

ఆ సాయంత్రం టపాలో వచ్చిన ఉత్తరం ఆ యింటో కొంత చైతన్యాన్ని కలిగించింది. అది రుక్కు బామ్మ చలపతికి రాయించింది.

'నాకీమధ్య వంటో బాగుండటంలేదు. మాటిమాటికి జ్వరం వస్తోంది. నాకు రోజులు నిండాయనుకుంటా. భయంగా ఉంది. ఒక్కసారి నా రుక్కును చూడాలనుంది. వోమాటు తీసుకు రాగలరా? మీ కెంతైనా రుణపడి ఉంటాను.'

ఆ ఉత్తరం ముందుగా పార్వతే చదివింది. ఆమె ముఖం వికసించింది. చిరకాలంగా విడివడని వో సమస్యకు పరిష్కారం దొరికినట్టయింది. ముందు రుక్కుకు ఆ ఉత్తరం చూపించి 'వెడతావా? ....' అనడిగింది. రుక్కు సరేనని తలూపింది. ఈ పెద్ద భవంతిలో తిట్ల మధ్య, నాగరికుల మధ్య కారాగారవాసం కంటె బామ్మ తియ్యటి ప్రేమలో తలదాచుకోవటం మేలనిపించింది. చలపతి ఉత్తరం చూశాడు.

'ఈ క్షణం దాన్ని తీసుకుపొండి' అంది పార్వతి.

అతను సమాధానం చెప్పలేదు.

ఆ సాయంత్రం గోపి ఉంగరం పోయిన సంగతి కనుక్కుంది పార్వతి. గుచ్చి గుచ్చి అడిగినా గోపి మాట్లాడలేదు. ఆమెకు రుక్కుమీద తప్పించి మరెవరిమీదా అనుమాన ముండేందుకవకాశం లేదు. గోపి నిజాన్ని దాచివుంచేందు కదే కారణం. నేరుగా వెళ్ళి పెట్టె తెరచి చూసింది. చలపతి అక్కడే ఉన్నాడు. ఉంగరం దొరికింది.


పండిత డి. గోపాలాచార్యులవారి
బ్రాహ్మీ అమృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

డాక్టర్ వృత్తి చేయండి!
ఇంటిలో విరామంగా కూర్చొని పుందేశ్యకు పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి.
INDIAN
HOMOEOPATHIC
COLLEGE
(APW) Jullundhar City.

నెలకు రూ. 200 సంపాదించండి
ఎలెక్ట్రిక్ మరియు రేడియో గైడ్–200 చిత్రాలతో–రేడియోను రూ. 15 లో తయారు చేసుకొనడానికి లేక మరామతులు చేయడానికి ఈ చిత్రాలు తోడ్పడుతాయి. ఇదిగాక ఎలెక్ట్రిక్ మెకానిజం, వైరింగ్ వగైరాలు నేర్చుకోవచ్చు. వెల రూ. 6/- టైలరింగ్–కటింగ్ రూ. 4– ఫోటోగ్రఫీ రూ. 3. పోస్టేజి రూ. 1. ప్రతి పుస్తకం పైనా అదనం.
ఇల్పా బుక్ డిపో (AD-1)
రఫత్‌గంజ్, అలీపూర్ (ఉ. ప్ర.)

మంచి పుస్తకాలు
జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- రూ 3-50
యువతి - స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు ... రూ 3-50
సంతానము - గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు ... రూ 3-50
ఉమ్మడి రహస్యాలు:- వ్యాపారంతో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు. రూ 5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోస్టు ఖర్చులుచితం క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును.
[illegible]

## తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది




# కమల శ్యామల స్వచ్ఛత



...నిజం — అతి స్వచ్ఛంగా, సహజంగా వున్న ఈ చిత్రాన్ని శాశ్వతంగా మీరు భద్రపరుచుకోవచ్చు— ఆగ్ఫా సింక్రో బాక్స్ కెమేరా ద్వారా ఇది సాధ్యం. అతి స్వల్పమైన ధర. ఫొటోలు తీయడం అతి తేలిక. మీ వెంట ఎక్కడికిబడితే అక్కడికి తీసికొనివెళ్ళి, మీకు నచ్చిన దృశ్యాలను చక్కగా ఫొటో తీసి శాశ్వతంగా భద్రపరుచుకోవచ్చు.

ధర రు. 29.50 స్థానిక పన్నులు అదనం

**ఆగ్ఫా సింక్రో బాక్స్ కెమేరా**

ఇండియాలో మొట్టమొదట తరగతికి చెందిన ఫొటో గ్రాఫిక్ పరిశ్రమ ఉత్పత్తి చేస్తున్నది

ఏక డిస్ట్రిబ్యూటర్లు : **ఆగ్ఫా ఇండియా లిమిటెడ్**

బొంబాయి • న్యూ ఢిల్లీ • కలకత్తా • మద్రాసు

CBAI-19TE


# రాగద్వేషాలు

రుక్కును చిత్తం వచ్చినట్టు హింసించింది. తక్షణం ఇంట్లోంచి పొమ్మంది.

'అమ్మా ! .... నేనే పెట్టెలో పడేశాను' అని గోపి అడ్డుపడినా ఆమె వినిపించుకోలేదు.

రుక్కు తన నిస్సహాయ స్థితి తెలుసుకుని మౌనంగా, దెబ్బల్ని సహిస్తూ లోలోన ఏడ్చింది.

'ఇంక చాలు—అది చస్తే నిన్నూ, నన్నూ ఖైదులో ఉంచుతారు' అని వారించాడు చలపతి.

'రేపు తెల్లవారేలోగా దీన్ని తీసుకుని పొండి' అనరిచింది పార్వతి.

ఆ రాత్రి ఆకలితో పడుకుంది రుక్కు. ఒళ్లంతా నొప్పులు. బోలెడు గాయాలు. మనసునిండా చీకటి. ఆమె జీవితం, భవిష్యత్తు అన్నీ చీకట్లో కలిసికోపోయాయి. ఇక పార్వతి ఆ యింట్లో ఉండ నివ్వదని ఆమె తెలుసుకుంది. తనకు 'దొంగ' బిరుదు కూడా దొరికింది. నిశ్శబ్దంగా ఏడ్చింది. అలా నిమిషాలు గంటలు దొర్లిపోయాయి. రుక్కు ఓ నిర్ణయానికి వచ్చింది. అలికిడి కాకుండా తన పెట్టె తీసుకుని వీధిలోకి వచ్చేసింది. గోపి ఉండు కున్న గది కేసి చూసింది. కన్నీరు ఆగిందికాదు.

'ఒకనాడు మీ నాన్న నిన్ను ఆదరిస్తాడు' అన్న బామ్మ మాటలు మళ్ళీ జ్ఞప్తి కొచ్చాయి. త్వర త్వరగా రైలుస్టేషనువైపు నడచిపోయింది.

* * *

మర్నాడుదయం పార్వతి నాలుగ్గంటలకే మేలుకొంది.

'ఐదింటికి పదమూటికి పోయే బండి ఉంది. మీ అమ్మాయితో త్వరగా వెళ్ళండి.' అని చలపతికి హితబోధ చేసింది.

చలపతి ఆమెకేసి ప్రశాంతంగా రెండు నిమిషాలు చూశాడు.

'పార్వతీ ! .... మనిషన్న తరువాత పొరపాట్లు చేయక తప్పదు.. ఒకరు చేసిన తప్పుకు మరొకర్ని దండించటం న్యాయంకాదు. రుక్కు నాకు చేసిన అపకారం ఏమిటి ? అది నానిద్దర్నీ ఎదిరిస్తూ తిరిగిన గోపిని కూడా పూర్తిగా మార్చివేసింది. ఆమెమీద నేనెందుకు కక్ష సాధించాలి ? ... ఈనాటి నుండి రుక్కు నా కూతురు. గోపిలాగే హాయిగా, ఈ యింటి పెద్దకూతురుగా పెరుగుతుంది. రుక్కూ ! .... రుక్కూ !....' అంటూ ఆవేశంతో అరుచుకుంటూ వంటింటికి పరుగెత్తాడు. పార్వతి ఏడుస్తూ అతని వెనకాలే వెళ్ళింది.

అక్కడ రుక్కు లేదు.

ఎక్కడా లేదు. వెతికాడు. లాభంలేదు. రైలు బండిలో ఉందని వాళ్ళకేం తెలుసు ? ఓ చిన్న రాయికింద రుక్కు రాసివుంచిన ఉత్తరం కన బడింది. చలపతి చదువుకున్నాడు.

'అబ్బాయిగారూ—నేను దొంగని కాదు. ఉంగరం నేను తియలేదు. నిజం భగవంతుడికే ఎరుక. నా మూలంగా మీరు దెబ్బలు తిన్నారు. అందుకు నేను చాలా బాధపడుతున్నా. మీరు అమ్మగారు చెప్పినట్లు నడచుకోవాలి. తలిదండ్రులు ప్రత్యక్ష దైవస్వరూపులు. వాళ్ళని ఎదిరించకూడదు. నా పుట్టినరోజు పండక్కి కొత్త బట్టలు కొనిమ్మని నేను అడగనప్పుడు అమ్మగారితో ఎందుకు అబద్ధం చెప్పారు.? .... ఎప్పుడూ నిజమే పలకాలి. మీరు చక్కగా చదువుకోండి. పొద్దున్నే అయిదింటికి లేస్తే పాఠాలు బాగా వస్తాయి. నాదగ్గర నేర్చుకున్న పాటలు మర్చిపోకండి. అప్పుడప్పుడు పాడుతూ ఉండండి. నేను లేనుకదాని సినిమాలు ఎక్కువ చూడకండి. మా బామ్మకి వంట్లో బాగాలేదు. అందుచేత చూట్టానికి పోతున్నా. అమ్మగారికి, అయ్యగారికి నమస్కారాలు.'

రుక్కు ముత్యాల్లా రాసింది.

చలపతి చిన్న పిల్లాడిలా గట్టిగా ఏడ్చాడు.

అతను చొక్కా తొడుక్కొని, పర్సు తీసుకుని బయలుదేరుతూంటే పార్వతి ఏడుస్తూ కూర్చుంది.

* * *

రుక్కు బండి దిగి నడక సాగించింది. బామ్మను చూడాలని ఆమె మనసు గంతులేస్తోంది. సంకెళ్ళు తెగి స్వేచ్ఛ దొరికిన బానిసలా ఆమె చరచర నడిచింది.

మనసు గాలితోబాటు హాయిగా విట్టూర్చింది.

'ఎందుకు వచ్చావ్ ?' అనడుగుతుందేమో బామ్మ!

'అనాడు నువ్వే చెప్పావుకదూ బామ్మా ! .... దాన్న యింటో ఉండటం కష్టమనిపిస్తే తిరిగి వచ్చేయమని' అంటుంది తను.

అలా వూహించుకుంటూ నడుస్తూంటే ఎదురుగా వో చిన్న గుంపు శవాన్ని మోసుకుంటూ భజనతో వస్తున్నారు. రుక్కు ఆగి చూడాలనుకుంది కాని, అందుకు వ్యవధి లేదు. వెంటనే బామ్మను చూడాలి. ఆమె వళ్ళో పడుకుంటే, జోకొడుతుంటే ఆకాశంలో విహరిస్తున్నట్లుగా ఉంటుంది. ఇకముందు తను పనిపిల్ల కాదు. బామ్మ మనవరాలు. అంతేకాదు. బామ్మకు జ్వరంగా ఉందని కూడా రాసింది. ఎలా ఉందో ఏమో ! త్వర త్వరగా అడుగులు వేసింది.

కాని—

పిచ్చి రుక్కు ! .... ఆ శవాన్ని చూసివుంటే ముందుకు అడుగు వేసేదికాదు. అది బామ్మ అంతిమ యాత్రని ఆమెకేం తెలుసు ? .... అంతేకాదు. వెనకాల బండిలో తన్ను తీసికెళ్ళటానికి చలపతి వస్తున్నాడని మాత్రం ఏం తెలుసు ?

అలా ఉత్సాహంగా పరుగుకుంటూ నడచిపోతోంది.

★





